క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

మానకొండూర్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంటు బకాయిలను తక్షణం విడుదల చేయాలని, తెలంగాణలోని యూనివర్సిటీల్లో రెగ్యులర్ వీసీలను నియమించాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలను ప్రస్తుత ధరలకు అనుకూలంగా పెంచాలని, వివిధ సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గాండ్ల అజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు ముక్కెర సతీశ్‌కుమార్, సంఘం సభ్యులు నూకల అభినయ్, నాగుల ఆకాశ్, గట్టు తిరుపతి వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో వికసిత్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత వివరించారు. వరి, పత్తి పంటల్లో చీడపీడలు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో నిఖిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

జీవో 25 రద్దు చేయాలి



మొలంగూర్‌లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

శంకరపట్నం: ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 25 రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అన్నారు. మండలంలో సోమవారం డీటీఎఫ్ సభ్యత్వం నమోదు చేపట్టారు. ప్రాథమిక పాఠశాలలో 10 నుంచి 60 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులే బోధించడం వల్ల విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. జీవోతో ప్రతి స్కూల్‌లో ఒకే టీచర్ పని చేయాల్సి వస్తుందని, జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద జీవో 25 రద్దు చేయాలని డీటీఎఫ్ ఉపాధ్యాయులు సోమవారం ఆందోళన నిర్వహించారు. జీవో 25ను సవరిస్తూ ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: ఆందోళన చేస్తున్న టీచర్లు

ఉద్యమకారులకు ఇళ్లు మంజూరు చేయాలి



ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, ఉద్యమకారులు

చిగురుమామిడి: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్‌తో పాటు పలువురు నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్ఐకి అందించారు. ఉద్యమకారులకు పెన్షన్, హెల్త్‌కార్డులు, పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు చిన్నసాయిలు, శ్రావణ్‌రెడ్డి, బాబు, మొగిలి, భూమ సదానందం, శంకరయ్య, ఎల్లయ్య పలువురు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో డ్రంకెన్ డ్రైవ్

ఇల్లందకుంట: మండల కేంద్రంలో ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన బ్రిడ్జి నిర్మించక నిత్యం అవస్థలు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి శివారులో గొల్లపల్లి గ్రామ ప్రధాన రోడ్డు మధ్యలోని కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయింది. జమ్మికుంట నుంచి వీణవంక మీదుగా కరీంనగర్‌కు వెళ్లే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కల్వర్టు తెగిపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇదివరకు రెండుసార్లు తెగిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని నూతన హై లెవల్ వంతెన నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.





శంకరపట్నం: మండలంలోని గుడాటిపల్లి గ్రామంలో మట్టిరోడ్లు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లపై వెళ్లేవారు జారిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలని, మట్టిరోడ్లపై కనీసం మొరం పోయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కృష్ణప్రసాద్, ఎంపీడీవో, శంకరపట్నం సెల్ నం : 99899 30713

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తుంది

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మొదటిసారిగా షూ పంపిణీ చేయడం ఆనందంగా ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పాదరక్షలు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో చాలాపేద విద్యార్థులే ఉంటారని, కలెక్టర్ పమేలా సత్పతి చొరవతో జిల్లాలోని విద్యార్థులకు షూ అందజేస్తామని, కార్యక్రమం చేపట్టిన కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయబోతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీలను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిందని, పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులను తయారు చేస్తున్నామని, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, దుస్తులు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఎంఈవో మధుసూదనాచారి, ఎంపీడీవో వరలక్ష్మి, మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు, ఉపాధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్ నాయకులు మడుపు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



మానకొండూర్‌లో విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తదితరులు

గ్రామాలాభివృద్ధిలో కార్యదర్శులే కీలకం

మానకొండూర్‌రూరల్: గ్రామాలాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యదర్శుల సేవలు మరువలేనివని, ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. శానిటేషన్, మంచినీటి సరాఫరాతోపాటు వివిధ పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను జీపీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఎంపీవో కిరణ్, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులను రెచ్చగొడుతున్నారు

శంకరపట్నం: సాంకేతిక కారణాలతో రుణమాఫీలో జాప్యం జరిగిందని, బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. కేశవపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 9వేల మంది రైతులుంటే 5 వేల మందికి మాఫీ జరిగిందన్నారు. మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, బస్వయ్య,మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతువేదికలో పోషణ మాసోత్సవం

మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. రైతువేదికలో పోషణ మాసోత్సవంలో పాల్గొని అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

కార్యదర్శులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

చిగురుమామిడి: పంచాయతీ కార్యదర్శులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, కొన్నేళ్లుగా పనిచేస్తున్న సీనియర్ కార్యదర్శులకు పదోన్నతి కల్పించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జీపీ కార్యదర్శులు కోరారు. చిగురుమామిడి మండల కేంద్రంలో సోమవారం మంత్రిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోదరి అజయ్ మాట్లాడుతూ.. నాలుగేళ్లు ఓపీఎస్‌గా పనిచేస్తున్న కార్యదర్శులను జెపీఎస్‌లుగు బదలాయించాలని కోరారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతోందన్నారు. దసరా పండుగకు వీధి దీపాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధుల్లేవని, ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు బి. రమేశ్, డి. సుస్మిత, ఎండీ అబ్దుల్‌వహీజ్, సంపత్, రమేశ్, పద్మావతి పలువురు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శుల సంఘం నాయకులు

'డబుల్' ఇళ్లు పూర్తి చేయాలని ధర్నా



చొప్పదండి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, లబ్ధిదారులు

చొప్పదండి: పట్టణంతో పాటు ఆర్నకొండ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి 200 మందితో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో 169 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.తొమ్మిది కోట్ల అంచనాలతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మధ్యలో నిలిపివేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుపేద లబ్ధిదారులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లు మేకలు, పశువులకు ఆవాసంగా మారాయన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నెల రోజుల్లో లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, మొగిలి సారయ్య, జక్కుల శంకర్, రాజన్నల రాజు, తోట కోటేశ్, బైరగోని కిట్టుగౌడ్, శివశంకర్, రామకృష్ణ, కుమార్, సమరసింహారెడ్డి, శివకృష్ణ, వీరేశం, సాయికృష్ణ, అనూష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ రశీదు అందిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

శంకరపట్నం: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి సోమవారం ప్రారంభించారు. మండలంలోని మెట్‌పల్లి, కొత్తగట్టు, లింగాపూర్, కేశవపట్నం గ్రామాల్లో సభ్యత్వం తీసుకున్న వారికి రశీదులు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, వెంకట్‌రెడ్డి, నరేందర్, సంపత్‌రావు పాల్గొన్నారు.

తుమ్మేటి సేవలు మరువలేం

జమ్మికుంట: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి సేవలు మరువలేమని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో కలిసి సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన ఆకస్మిక మృతి బాధాకరమన్నారు. అనంతరం హుజూరాబాద్ కేంద్రంగా పీవీ జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, గెల్లు శ్రీనివాస్, బండ శ్రీనివాస్, తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు,తదితరులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్: చదువుతోపాటు బాలబాలికలకు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం మనందరి బాధ్యత అని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... హుజూరాబాద్ ప్రాంతం క్రీడాకారులకు నిలయమని, కబడ్డీ, ఖోఖో, హాకీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, తదితర క్రీడాకారులు ఎక్కువగా ఉన్నారని, వారికి ఆదరణ సైతం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పోటీల్లో బాలబాలికల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ సొల్లు సారయ్య, హెచ్ఎంలు శోభారాణి, తిరుమల, శ్రీనివాస్, విడపు శ్రీనివాస్, పీడీలు వేణు, నర్సయ్య, శ్రీనివాస్, చిరుత శ్రీనివాస్, కాల్వ రేణుక, సత్యానందం, అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, అధికారులు, నాయకులు, తదితరులు

'కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలి'

సైదాపూర్: మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి మాట్లాడారు. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్ నాయకులు భ్రమపడుతున్నారని, ఐదేళ్ల తర్వాత ఎవరి పరిస్థితి ఏంటో ప్రజలే తేలుస్తారని, ఇప్పటివరకు నియోజకవర్గం, సైదాపూర్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక్క పని కూడా చేయలేదన్నారు. నూతన గ్రామ పంచాయతీలు, తారురోడ్లు, సబ్‌స్టేషన్లు, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మంజూరు చేసినవేనని, అభివృద్ధి చేసి మాట్లాడితే ప్రజలు మెచ్చుకుంటారని, అసత్యాలు మాట్లాడితే అసహ్యించుకుంటారని అన్నారు. మంత్రిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే అందరూ హర్షిస్తారని, పదేండ్లలో కక్షపూరిత రాజకీయాలు చేయలేదన్నారు. మంత్రి పొన్నం, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఒకరినొకరు గౌరవించుకుంటారని, అధికార పార్టీ స్థానిక నాయకుల వైఖరితో పది నెలల్లోనే గ్రామాల్లో రాజకీయ వైషమ్యాలు ఏర్పడ్డాయన్నారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు రావుల రాజిరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, బర్మావత్ శంకర్, పైడిపల్లి రవీందర్‌గౌడ్, వర్నె మోహన్‌రావు, గొల్లపెల్లి శ్రీనివాస్, రమేశ్, కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, నాయకులు

సంక్షిప్త వార్తలు

✦ రైతులకు అవగాహన

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ సొసైటీ ఆవరణలో సోమవారం బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. వరిలో చీడపురుగులు, తెగుళ్లు, దోమపోటు నివారణ చర్యల గూర్చి వివరించారు. రైతులు, కంపెనీ ప్రతినిధులు విక్రమ్‌రెడ్డి, సూపర్‌వేజర్ సంపత్, ఎఫ్ఓఎస్ శ్రీకాంత్, బాబు పాల్గొన్నారు.

✦ చెట్ల కొమ్మలు తొలగింపు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో మంచినీటి బావిపైకి విస్తరించిన చెట్ల కొమ్మలను సోమవారం తొలగించారు. రావిచెట్టు కొమ్మలు ఏపుగా పెరిగి పక్కన ఉన్న మంచినీటి బావితో పాటు భక్తాంజనేయస్వామి శంకర దేవాలయంకి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. బావిలో చెట్టు ఆకులుపడటంతో నీరు కలుషితమయ్యే కలుషితమయ్యే ప్రమాదం ఉందని, ప్రజలకు ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా చెట్ల కొమ్మలు తొలగించామన్నారు.

✦ సెల్‌ఫోన్ అప్పగింత

గంగాధర: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. గంగాధరకు చెందిన మల్యాల రాజేందర్ ఈ నెల 18న ఫోన్ పోగొట్టుకున్నాడు. కొత్తగా తీసుకువచ్చిన పోర్టల్ ద్వారా ఫోన్ స్వాధీనం చేసుకొని సోమవారం రాజేందర్‌కు అప్పగించామని వివరించారు.

✦ పాఠశాలలో చేరిక

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన ముంజ పద్మనారాయణ కుమారుడు సాయిమణిని జిల్లా కేంద్రంలోని ఫ్రీడమ్ ఫైటర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి సోమవారం చేర్పించారు. కొద్దిరోజులుగా సాయిమణి మానసికంగా బాగా లేకపోవడంతో సదరన్ సర్టిఫికెట్ తీసుకొని స్కూల్‌లో చేర్పించారు.

✦ దోషులను కఠినంగా శిక్షించాలి

గన్నేరువరం: ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి లడ్డూ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. మండలకేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూను అపవిత్రం చేసినవారిని వెంటనే గుర్తించి దోషులను కఠినం శిక్షించాలని డిమాండ్ చేశారు.

✦ బొడ్డు సునీల్‌కు సన్మానం

గన్నేరువరం: మున్నూరుకాపు సంఘం గన్నేరువరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బొడ్డు సునీల్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డితోపాటు వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు సోమవారం గన్నేరువరంలో సన్మానించారు.

✦ వీణవంకలో దొంగల హల్‌చల్

వీణవంక: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో దొంగలు హల్‌చల్ చేశారు. నల్ల పోచమ్మ వైన్స్‌లోకి చొరబడి కౌంటర్‌లోని రూ.30 వేలు, రూ.60 వేల విలువ గల మద్యం సీసాలు, సీసీ కెమెరాల రికార్డు డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారు. ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాపులో చోరీకి పాల్పడ్డారు. రెండు షాపుల్లో సీసీ కెమెరాల డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారని ఎస్ఐ తోట తిరుపతి వివరించారు.

✦ రెండు జీపీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లె గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా కవిత, రాకేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చీమలకుంటపల్లెకు సాంబయ్యపల్లె కార్యదర్శి కవిత, గునుకులకొండాపూర్‌కు పీచుపల్లి కార్యదర్శి రాకేశ్‌కు మండల పరిషత్ అధికారులు బాధ్యతలు అప్పగించారు.

✦ బఫర్ జోన్ హద్దులు నిర్ణయించాలి

చొప్పదండి: పట్టణంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమిలో బఫర్‌జోన్ ఏర్పాటు చేసి హద్దులు నిర్ణయించాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ సోమవారం అధికారులకు వినతిపత్రం అందించారు. బఫర్ జోన్ నిర్ణయించడంలో నిబంధనలు పాటించాలని కోరారు. శిఖం భూమిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలన్నారు. వెంటపాటు బి. రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆలయాలకు రూ.1,61,111 విరాళం

రామడుగు: గోపాల్‌రావుపేటలో దేవాలయాల పునర్నిర్మాణం కోసం శ్రీప్రగతి స్కూల్ యాజమాన్యం శ్రీ మండవ నాగేశ్వర్‌రావు జ్ఞాపకార్థం రూ.1,11,111 విరాళం ప్రకటించింది. సోమవారం దేవాలయాల నిర్మాణం కమిటీ సభ్యులకు స్కూల్ కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ చెక్కు అందశారు.

చొప్పదండి: పట్టణంలోని శివకేశవాలయానికి తొగరిమామిడికుంటకు చెందిన గుర్రం లక్ష్మి, కొమురెల్లారెడ్డి దంపతులు రూ.యాభైవేల విరాళం ప్రకటించారు. ఆలయ అర్చకులతో పాటు వివేకానంద యూత్ క్లబ్ సభ్యులకు నగదు అందించారు. మధు, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు మంచాల మోహన్, గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, బి.వెంకటేశం, జనగామ సత్యనారాయణ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ రాధాకృష్ణ, తదితరులు

దారి ఇప్పించండని వేడుకోలు



జమ్మికుంట: పక్క ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కొలిపాక విద్యాసాగర్. మున్సిపల్ పరిధి కొత్తపల్లి 19వ వార్డులో నివాసం ఉంటున్నాడు. సర్వే నంబర్ 444/సీలో ఇతనిపాటు ఐదుగురికి ప్లాట్లు ఉన్నాయి కానీ దారి లేదు. 2008 నుంచి తన ప్లాట్‌కు దారి చూపాలని ముందు ప్లాట్ యాజమాని బూర రాజయ్యను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ప్లాట్ నుంచి 12 ఫీట్ల దారి కోసం పెద్ద మనుషుల సమక్షంలో రూ.1.6 లక్షలకు ఖరీదు చేయగా రూ.పదివేలు అడ్వాన్స్‌గా ఇస్తే కాగితం రాసి ఇచ్చారు. మిగతా రూ.1.50 లక్షలు తీసుకొని కాగితం రాసివ్వలేదు. కొనుగోలు చేసిన దారిలో మొరం పోయగా రోడ్డును చదును చేసి ఫెన్సింగ్ వేశారు, అడిగితే ఖరీదు నచ్చలేదంటున్నారని బోరున విలపించాడు. పలువురు ప్రజాప్రతినిధులు అడ్డుపడుతున్నారని, ఇకనైనా దారి ఇప్పించాలని వేడుకున్నాడు.